807) వరాళి

ప॥ యజ్ఞమూర్తి యజ్ఞకర్త యజ్ఞభోక్తవిన్నిటాను।
యజ్ఞాది ఫలరూపము ఇటు నీవై ఉండవె॥

చ॥ పరికించ జీవులకు ప్రణమవైన నీకు। నిరతి ప్రాణ ప్రతిష్ట నేము సేసేమా।
మరిగి మా పూజలంది మమ్ము గాచెడి కొరకు। హరి నీ మూర్తి ప్రాణమావహించవే॥

చ॥ జగతికి నీ పాద జలమే సంప్రోక్షణ। జిగి నీకు సంప్రోక్షణ చేయువారమా।
పగటున నన్ను నేడు పావనము సేయుటకు। అగు పుణ్య తీర్థముల అభిషేకమందవే॥

చ॥ వేదములు తెచ్చిన శ్రీవేంకటేశ నేము నీకు। వేద మంత్రముల పూజ విధి సేసేమా।
యీాదెస నీ దాసులమయిన మమ్ము గాచుటకు। వేదమూర్తివై యిందే విచ్చేసి వుండవే॥